ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 26
సంచిక : 137
పేజీలు : 4

శనివారం, ఫిబ్రవరి 07, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి



### -కాంగ్రెస్ మైనారిటీ సెల్ కార్యదర్శి మజీద్ పాషా

**టీ మీడియా, ఫిబ్రవరి6,సింగరేణి(కారేపల్లి):**రాష్ట వ్యాప్తంగా గల తెలంగాణ మైనారిటీ గురుకులాలలోని సి ఓ ఈ సెంటర్ ఆఫ్ ఎక్స లన్సీ లను రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి అని కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్ పాషా (షేరు) శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గల 17 సీఓఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయని గత ఏడాది జరిగిన ప్రవేశ పరీక్షలో యంబీబీఎస్, బీ డీఎస్ 39 సీట్లు, ఐఐటీల లో 38 సీట్లు, ఆఫ్సెట్ లో 1417 సీట్లు కన్వీనర్ కోటాలో ఉచితంగా పొందడం జరిగిందని అన్నారు. కార్పొరేట్ కళాశాలకు ధీటుగా నిష్ణాతులైన సిబ్బందితో విద్యాబోధన జరుపుతున్న కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రవేట్, ఎయిడెడ్ , మైనారిటీ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థులు

మిగతా 3లో

# సమ్మక్క సారక్క మీరే దిక్కు



### మేడారం హుండీ కానుకల్లో చిత్ర విచిత్రాలు..

### -ఆస్తి కోసం ఒకరు.. ప్రేమకోసం మరొకరు..



**టి మీడియా,ఫిబ్రవరి 6, ములుగు బ్యూరో:**మేడారం హుండీ లెక్కింపు కొనసాగుతోంది.. అయితే భక్తులు హుండీలో డబ్బుతో పాటు కొన్నిలేఖలు కూడా వేయడం, లెక్కించే సిబ్బందిని షాక్ అయ్యేలా చేసింది. జాతర హుండీల లెక్కింపులో కొన్ని ప్రేమలేఖలు రావడం, తమ ప్రేమ సక్సెస్ కావాలని కోరుకుంటున్న లేఖలు హుండీలో కనిపించాయి. అంతేకాదు ఆస్తి తగాదాలు పరిష్కారం అవ్వాలని, భార్యాభర్తల పంచాయతీలు లేకుండా ఉండాలని ఇలా రకరకాలుగా రాసి హుండీలలో వేశారు. హుండీలను లెక్కిస్తున్న సిబ్బందికి ఈ లేఖలు దర్శనమివ్వడం ఆసక్తికర చర్చకు కారణమైంది. ఈ హుండీ లెక్కింపు ప్రక్రియ మొత్తం పది రోజుల పాటు సాగనుంది.మేడారం మహా జాతరలో ఏర్పాటుచేసిన 828 హుండీలను హన్మకొండలోని టిటిడి కళ్యాణ మండపానికి తరలించి స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపరచారు.. సీసీ కెమెరాల పర్యవేక్షణతో పాటు, పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు.. 5వ తేదీ నుండి కట్టుదిట్టమైన భద్రత మధ్య హుండీల లెక్కింపు కొనసాగుతోంది.. సుమారు 500 మంది సిబ్బంది హుండీల లెక్కింపులో పాల్గొంటున్నారు.అయితే హుండీ కౌంటింగ్ లో లభ్యమవుతున్న కానుకలతో పాటు భక్తుల లేఖలు సిబ్బందిని ఆశ్చర్యపరుస్తున్నాయి.. వింత వింత కోరికలు లేఖల రూపంలో రాసి సమ్మక్క సారక్క దేవతలకు మొరపెట్టుకొని హుండీలలో వేశారు.ఓ భక్తుడు తన కొడుకు బారి నుండి కాపాడు తల్లిని వేడుకుంటూ 100 రూపాయల నోటు పై తన కోరిక రాసి సమ్మక్క తల్లి హుండీలో వేశాడు.. మరో భక్తుడు తన తల్లిదండ్రుల ఆస్తి శివరాత్రి లోపే తనకు దక్కేలా చూడాలని కోరుకుంటూ లేఖ రాసి సమ్మక్క తల్లి హుండీలో వేశాడు.మరో ప్రేమ జంట వాళ్ళ ఇరు కుటుంబాలు కలిసి వారిని ఆహ్వానించాలని, ఇరు కుటుంబాలు కలిసి శుభకార్యాలు నిర్వహించాలని కోరుకున్నారు. సమ్మక్క సారక్క దేవతలకు లేఖ రాసి అందులో వేశారు.. మరో భక్తుడు వాళ్ళ ఉద్యోగాలు రెగ్యులరైజ్ అయ్యేలా దీవించుతల్లి అని వేడుకుంటూ లేఖలు రాశాడు.వింత వింత కోరికలతో భక్తులు సమ్మక్క సారక్క దేవతల హుండీలో వేసిన లేఖలు కౌంటింగ్ లో కలకలం రేపుతున్నాయి.. సిబ్బంది కడుపుబ్బ నవ్వుకుంటూ కాస్త రిలాక్స్ అవుతున్నారు.

**రెండో రోజు కౌంటింగ్ పూర్తి**

మేడారం హుండీల లెక్కింపు రెండో రోజు పూర్తయ్యింది. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో భారీ భద్రత మధ్య జరుగుతున్న హుండీల కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ( ఫిబ్రవరి 6 ) రెండో రోజు 285 హుండీలను లెక్కించినట్లు తెలిపారు అధికారులు. ఇప్పటి దాకా 285 హుండీలను లెక్కించగా.. రూ. 6 కోట్ల 4 లక్షల 43 వేల 636 ఆదాయం వచ్చినట్లు తెలిపారు అధికారులు. మొత్తం 828 హుండీలకు గాను ఇవాళ్టికి 285 హుండీల కౌంటింగ్ పూర్తయినట్లు తెలిపారు అధికారులు.హుండీల ద్వారా లభ్యమైన ఆదాయం

మిగతా 3లో



## భద్రాచలంలో

# ఆదివాసి గిరి మాల్ట్

**టీ మీడియా ఫిబ్రవరి 6 ,భద్రాచలం టౌన్ :** భద్రాచలం పట్టణంలో త్వరలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి మాల్ట్ ప్రారంభం కానుంది. ప్రజలందరికీ సరసమైన ధరలకు అన్ని రకాల వస్తువులు లభించేలా ఈ మాల్ట్‌ను శ్రీరామనవమి లోపు అందుబాటులోకి తీసుకువస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలు నడుపుకుంటున్న ఆదివాసి గిరిజన కుటుంబాలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు తయారు చేస్తున్న ముడి సరుకులను నేరుగా గిరి మాల్ట్‌కు సరఫరా చేయాలని వారు సూచించారు. శుక్రవారం బూర్గంపాడు లోని అక్షయ గ్రామీణ చెక్క గానుగ వేరుశెనగ నూనె యూనిట్ సభ్యులను సంప్రదించిన ఆయన, నూనె తయారీ విధానం, వేరుశెనగలకు మార్కెటింగ్ సౌకర్యాల వివరాలు తెలుసుకున్నారు. ఆదివాసి గిరిజన గ్రామాల్లో నివసించే గిరిజనులకు, ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు, ఇంటి నిత్యావసర వస్తువులు సులభంగా లభించేలా గిరి మాల్ట్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు. నాణ్యతగా తయారు చేసిన నూనెను నేరుగా మాల్ట్‌కు సరఫరా చేయాలని యూనిట్ సభ్యులకు సూచించారు.అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గిరిజన గర్భిణీ స్త్రీలకు బాలామృతం పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బి.రాహుల్, గర్భిణీలు తప్పకుండా అంగనవాడి సెంటర్లలో బాలమృతం తీసుకోవాలని సూచించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగనవాడి టీచర్లు పరిధిలో గర్భిణీలను గుర్తించి, వారిని సెంటర్లకు తీసుకువచ్చి బాలమృతం అందించేలా చూడాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అందేలా ఏర్పాటు చేయాలని కొనసాగించారు.

మిగతా 4లో

# విధులను పకడ్బందీగా నిర్వహించాలి..

### -జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టి మీడియా,ఫిబ్రవరి 6, ఖమ్మంబ్యూరో**:నగరపాలక సంస్థ సిబ్బంది తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు.జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశం మందిరంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పని తీరుపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కారణంగా కొంత మేర మంచి ఫలితాలు వచ్చాయని, మరొకసారి ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. చెత్త రవాణా వాహనాలకు జిపిఎస్, ఫ్యూయల్ సెన్సార్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. చెత్త వాహనాల మూవ్ మెంట్ రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని కలెక్టర్ తెలిపారు. వాహనాలకు అవసరమైన మరమ్మత్తులు ఉంటే వెంటనే చేయించాలని, పారిశుధ్య కార్మికుల హాజరు నమోదులో ఎఫ్.ఆర్.ఎస్. విధానం అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ లో భాగంగా నగరంలో కనీసం 1000 ఓపెన్ ప్లాట్ లను గుర్తించి అక్కడ పిచ్చి మొక్కలు తొలగించాలని, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో మీడియన్ లను రెగ్యులర్ గా క్లీన్ చేయాలని, డస్ట్ ఇబ్బంది రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. నగరంలో బ్రిడ్జి మీద ప్రచార హోర్డింగులు, పోస్టర్ లు అనుమతి లేకుండా పెట్టడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా ఉన్న హోర్డింగులు, పోస్టర్లను తొలగించాలని, మరొకసారి అనుమతి లేకుండా పబ్లిక్ ప్రదేశాలలో పోస్టర్లు అతికిస్తే భారీ జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థలో నూతనంగా కొనుగోలు చేస్తున్న 4 వాహనాలు త్వరగా డెలివరి వచ్చేలా చూడాలని అన్నారు. నగరంలో ప్రధాన రోడ్లలో డస్ట్ ఇబ్బంది లేకుండా, పేవ్ మెంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో మంజూరైన సిసి రోడ్ల, డ్రెయిన్ లను పూర్తి స్థాయిలో గ్రౌండ్ అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. సిసి రోడ్ల నిర్మాణం త్వరగా నాణ్యతతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పనుల పర్యవేక్షణకు డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎఫ్.ఎస్.టీ.పి. మరమ్మత్తు పనులు చేపట్టాలని అన్నారు. అభివృద్ధి పనులలో ఎటువంటి



నిర్లక్ష్యం చేయవద్దని, పనుల పురోగతిపై ప్రతివారం నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మార్చి మొదటి వారం నాటికి ఫుట్ పాత్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. వాయు

మిగతా 4లో

# సీఎం కప్పు పోటీలు ప్రారంభం



## టి మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ

**టి మీడియా,ఫిబ్రవరి 6, ఖమ్మం రూరల్ :** మండలం లోనీ చింతపల్లి గ్రామంలో టి మీడియా క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరెంపుల మరియమ్మ, ఉప సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ తోట జగన్ గారు మరియు బి ఆర్ ఎస్ మండల ఉపాధ్యక్షుడు ముత్యం పెద్ద కృష్ణారావు గారు, తోట శ్రీను గారు, చాపల సత్యనారాయణ గారు యూత్ లీడర్ చాపల రాకేష్, మాజీ ఉప సర్పంచ్ అరెంపుల ఉప్పలయ్య, సుదగాని హనుమంతరావు, అరెంపుల, జాన్, అరెంపుల మునేష్, అరెంపుల ఉమరావు తదితరులు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి తోట జగన్ గారు మరియు ముత్యం పెద్ద కృష్ణారావు గారు టి మీడియా ప్రజల తరపున వారి సమస్యల పై పోరాటం లో ముందు ఉంటుంది అని వ్యాఖ్యానించారు.



## జాతరకు పోటెత్తిన జనం

**-వనం నుంచి జనంలోకి సమ్మక్క**

**టీ మీడియా ఫిబ్రవరి6,దుమ్ముగూడెం:** ఆదివాసీలు ఆరాధ్య దేవతలుగా కొలిచే దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం సమ్మక్క సారలమ్మ (మినీ మేడారం) అడవి తల్లుల జాతరకు భక్తులు పోటెత్తారు. మూడవరోజు గురువారం నిండు జాతర కావడంతో భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్ల గద్దెలను దర్శించుకోవడంతోపాటు బెల్లం, మొక్కులు సమర్పించుకున్నారు. నిండు జాతర సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు సమీప గుట్టల నుంచి వనదేవత మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో గుడికి చేరుకోగా, సాయంత్రం నాలుగు గంటలకు సమ్మక్క గుట్ట నుంచి మేళ తాళాలు , మంగళ వాయిద్యాలు, కోయ డ్యాన్సులు డప్పుల మధ్య ఇలవేల్పులతో వేడుకగా గద్దె పైకి చేరుకున్నారు.సమ్మక్క సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు. దేవరబాలలు సోడి అచ్చమ్మ, శాంతమ్మలు భక్తులకు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. నిండు జాతర సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి రాహుల్ అమ్మవార్ల గద్దెను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీతోపాటు, వాలంటీర్లు ప్రత్యేక ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే వెంట భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మాజీ జెడ్పిటిసి అన్నే సత్యనారాయణమూర్తి , కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షులు లంక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు తెల్లం హరికృష్ణ తదితరులు ఉన్నారు.



## అంగన్‌వాడీ లో సీమంతం వేడుకలు

**టీ మీడియా ఫిబ్రవరి06, భూర్గంపహాడ్ :** అంగన్వాడీ కేంద్రంలో ఐటీసీ మిషన్ సునెహ్రా కల్ – ఐజీడీ సంస్థ వారు, సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ పీవో, ఐఏయస్ రాహుల్ సార్, ఐజీడీ సంస్థ నుండీ ఫీల్డ్ కోఆర్డినేటర్స్ ప్రమీల, అభిషేక్, అంగన్వాడీ టీచర్స్ పద్మ, సుమిత్ర, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐఏఎస్ రాహుల్ సార్ గారు మాట్లాడుతూ ముందుగా గర్భిణీ స్త్రీలకు శుభాకాంక్షలు తెలుపుతూ గర్భిణీ గా ఉన్న సమయం లో తీసుకోవలసిన జాగ్రత్తలను గుర్తుచేశారు, ఆహారం పట్ల శ్రద్ధ వహించి మంచి పోషణ తో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపి ప్రభుత్వ హాస్పిటల్ లోనే డెలివరీ జరిగేలా చూడాలని వివరించారు. గర్భిణీ స్త్రీలకు వడి నింపే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఐటీసీ మిషన్ సునేహ్రా కల్, ఐజిడి సంస్థ నుండి ప్రమీల మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు సీమంతం అనేది చాలా సంతోషకరమైన వేడుక అని, అదే విధంగా గర్భిణీగా ఉన్నప్పుడు చాలా జాగ్రత వహించాలి అని, ప్రధానంగా రక్త హీనత (అనీమియా) గురించి ప్రస్తావించారు. అనీమియా బారిన పడకుండా మంచి పోషణ తో కూడిన ఆహారం తీసుకోవటంతో పాటు తప్పనిసరిగా రెగ్యులర్ చెకప్ చేయించు కోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు చిరుధాన్యాలు యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు,

**టీ మీడియా ఫిబ్రవరి6,మధిర:** మధిర నియోజకవర్గ స్థాయి సీఎం కప్పు టోర్నమెంట్ గురువారం మధిర ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. మధిర రూరల్ సీఐ రమేష్ మధిర విద్యాశాఖ అధికారి ప్రభాకర్ క్రీడాకారులు పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఎర్రుపాలెం, మధిర, బోనకల్లు, చింతకాని,ముదిగొండ, మండలాల నుండి క్రీడాకారులు 700 మంది హాజరయ్యారు. మొదటి రోజు క్రీడలు విజయవంతంగా జరిగాయి.కబడ్డీ పురుషులు విభాగం మొదటి బహుమతి ఎర్రుపాలెం మండలం, రెండవ బహుమతి మధిర, కబడ్డీ బాలికల విభాగం మొదటి బహుమతి మధిర, రెండవ బహుమతి ఎర్రుపాలెం, ఖో ఖో మొదటి బహుమతి బాలురు విభాగం మధిర, రెండవ బహుమతి ఎర్రుపాలెం, బాలికల విభాగం ఖో ఖో మొదటి బహుమతి మధిర, రెండవ బహుమతి ఎర్రుపాలెం, వాలీబాల్ బాలురు విభాగం మొదటి బహుమతి చింతకాని, రెండవ బహుమతి మధిర, బాలికల విభాగం మొదటి బహుమతి మధిర, రెండవ బహుమతి చింతకాని విజేతలుగా నిలిచారు. 6 న షటిల్, క్యారమ్, చెస్, అథ్లెటిక్స్, కరాటే, యోగ,పోటీలు నిర్వహించడం జరుగుతుందని, మొత్తం 700 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ వై. చిన్ని తెలిపారు. ఈ కార్యక్రమం వై రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మారాబత్తుల జమలయ్య, శ్రీనివాస్ రావు, చైతన్య,



బి. శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్, క్రిష్ణా రావు, నాగేశ్వరావు,రవికుమార్, మాదవ రావు, రవి, నరసింహ రావు, తదితరులు పాల్గొన్నారు.



## సంతను ప్రారంభించిన సర్పంచ్

**-వనవాసం నరేందర్ రెడ్డి**

**టీ మీడియా, ఫిబ్రవరి 6, తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండల పరిధిలోని జూపెడ గ్రామంలో గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా సంత ను శుక్రవారం జూపెడ గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి ప్రారంభించారు ఈ సంత ప్రతి శుక్రవారం రోజున జూపెడ సెంటర్లో సంత కొనసాగుతుందని గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు తాజా కూరగాయలు, ఆకుకూరలు ఇతర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులు తమ పంటలను నేరుగా విక్రయించే అవకాశం కల్పించడంతో రైతులకు న్యాయమైన ధర లభించనుందని గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి నేతృత్వంలో ఈ నూతన సంత ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. ఈ సంత ప్రారంభం తో స్థానిక రైతులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. గ్రామంలో నిత్యావసరాల కొనుగోలు సులభమవడంతో ప్రజలకు సమయం, ఖర్చు ఆదా అవుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రజలు హర్షాతిరేకాలతో స్వాగతిస్తూ సంతను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కూరగాయలకు విక్రయిసించడానికి వచ్చిన మహిళను శాలువాతో సన్మానించి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం లో జూపెడ గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకులు గంద్ర గోపాలరావు ఎంపీటీసీ లంజపల్లి శ్రీనివాస్ గ్రామ వార్డు సభ్యులు అంబాల రామ్మూర్తి లంజపల్లి శ్రీకాంత్ గ్రామ పెద్దలు తిప్పారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తిప్పారెడ్డి లక్ష్మారెడ్డి ఇందుర్తి మల్లారెడ్డి నందిపాటి వెంకన్న బోల్లి కొండ మల్లయ్య బుల్లి కొండ రామచంద్రు పైనంపల్లి రఘునాధపాలెం సోలిపురం బచ్చోడు తండా కాకరవాయి రాజారం ఆయా గ్రామ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్--365 పక్కనే దొంగతనం

**టీ మీడియా,ఫిబ్రవరి 6,చివ్వెంల:** జాతీయ రహదారి ఎన్‌హెచ్--365కు అతి సమీపంలోనే దొంగలు రెచ్చిపోవడం చివ్వెంల మండలంలో భద్రతపై తీవ్ర సందేహాలు కలిగిస్తోంది. అక్కలదేవిగూడెం గ్రామ పరిధిలోని అమరగాని ఆంజనేయులు వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్‌లోని విలువైన పనిముట్లను గుర్తుతెలియని దొంగలు రాత్రి వేళ దొంగిలించారు. ఈ ఘటనలో రైతులకు అత్యంత అవసరమైన స్టార్టర్ పెట్టెలు, విద్యుత్ వైర్లు ఎత్తుకెళ్లడంతో సాగు పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. జాతీయ రహదారి పక్కనే ఈ తరహా దొంగతనాలు జరుగుతుండటం, వరుస ఘటనలపై చర్యలు లేకపోవడం రైతులు, గ్రామస్తుల్లో భయాందోళనను పెంచుతోంది. దొంగలు ఎవరో ఇప్పటికీ తేలకపోవడంతో, గ్రామంలో రాత్రి పహారా, పోలీస్ గస్తీ పెంచాలని, దొంగలను వెంటనే పట్టుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.





## ప్రభుత్వ అద్దె వాహనాల డ్రైవర్ల సమ్మె

**టీ మీడియా ఫిబ్రవరి6,సూర్యాపేట:** ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ విభాగాలకు అద్దె ప్రాతిపదికన ఫోర్ వీలర్ వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 7న బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చింతలచెరువు పవన్, ప్రధాన కార్యదర్శి గంగాధర్ వెంకన్న, జిల్లా నాయకులు రహీం గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 7న బంద్ నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ వినతిపత్రాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌కు గురువారం అందజేశామని, రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు సూర్యాపేట జిల్లాలో కూడా బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అద్దె ఫోర్ వీలర్ వాహనాల డ్రైవర్లందరూ విధిగా బంద్‌లో పాల్గొనాలని వారు కోరారు.



## యూరియా కోసం సొసైటీ ఆఫీసుకు తాళం

**చిలుకూరులో రైతుల ఆందోళన**

**టీ మీడియా,ఫిబ్రవరి 6,కోదాడ,(చిలుకూరు):** యూరియా సరఫరా సక్రమంగా జరగడం లేదంటూ ఆగ్రహించిన రైతులు శుక్రవారం ఉదయం చిలుకూరులో సిబ్బందిని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలోకి వెళ్లనీయకుండా తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గోదాంకు కూడా తాళం వేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ... రైతులకు అత్యవసరమైన యూరియా సరఫరాలో నూతనంగా ప్రవేశపెట్టిన యాప్ తో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్టాక్ వివరాలు కూడా సరిగా ఉండడం లేదని ఆరోపించారు.సొంత ప్రాంతంలోని సహకార సంఘంలో కాకుండా ఎక్కడో దూరప్రాంతాల్లో ఉన్న ప్యాక్స్ లో యూరియా తీసుకోవాలంటున్నట్లుగా వారు ఆరోపిస్తున్నారు. సీఈవో చిలువేరు లక్ష్మీనారాయణను సంప్రదించగా ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లావ్యాప్తంగా రైతులు యాప్ లో యూరియా బుక్ చేసుకుంటే ఏ ప్రాంతంలోనైనా వారికి యూరియా అందుబాటులోకి వస్తుందని అన్నారు. నిబంధనల ప్రకారం పని చేస్తున్నట్లు తెలిపారు.



## వెంకటేశ్వర స్వామి తిరుకళ్యాణ మహోత్సవం

**టీ మీడియా,ఫిబ్రవరి 6,అశ్వాపురం:** నెల్లిపాక బంజర గ్రామంలో స్వయంభువుగా వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ అభినవ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 22వ వార్షికోత్సవ తిరుకళ్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుకళ్యాణ మహోత్సవం భక్తులను కనువిందు చేసేలా అద్భుతంగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ వీరమాచినేని రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణాన్ని కనులారా వీక్షించి మొక్కులు చెల్లించుకుని మహా అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



## ఎస్ఓపై  చర్యలు తీసుకోవాలి

**- ఎస్ఎఫ్ఐ మండల నాయకులు**

**టీ మీడియా,ఫిబ్రవరి 6,ములకలపల్లి:** కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ముదిగొండ ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల నందు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. తల్లిదండ్రుల సమాచారం మేరకు ఎస్ఎఫ్ఐ నాయకులు ముదిగొండ ప్రశాంత్ హాస్టల్ వద్దకు వెళ్ళి విద్యార్థిని తీగుళ్ళ గౌతమి ని సమస్యలు ఆడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాల నందు విద్యార్థినీలు భోజనంలో పురుగులు, దోడ్డు బియ్యం, ఉడికిఉడకని భోజనంతో రాత్రి సమయంలో కడుపులో నొప్పి వస్తుందని విద్యార్థినిలు ఎస్ఎఫ్ఐ నాయకుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రభుత్వాలు విద్యార్థినుల సంక్షేమం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని ములకలపల్లి కస్తూరిబా గాంధీ పాఠశాల లో అవేవీ పట్టనట్లుగా ఎస్ ఓ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.ఉడికిఉడకని అన్నం తిని రాత్రి సమయంలో కడుపులో మంట, నోప్పి వస్తుందని విద్యార్థీనీలు తమకు తెలిపారని హాస్టల్ లో భోజనం రుచికరంగా లేదని విద్యార్థీనీలు ఎవరైనా తల్లిదండ్రులకు తెలియపరిస్తే ఆ విద్యార్థీనిని టార్గెట్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని విద్యార్థులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు.ములకలపల్లి కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థుల సమస్యల పై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినితల్లిదండ్రులు,ఎస్ఎఫ్ఐనాయకులునాగచైతన్య,చందు,సింధు,ప్రియ,లావణ్య, మౌనిక, తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ విషయమై కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల స్పెషల్ ఆఫీసర్ మల్లీశ్వరిని వివరణ కోరగా గౌతమి అనే విద్యార్థీనిని బయటకు పంపాలని తన తల్లి  కోరగా ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉన్నందువలన పంపడం వీలు పడదని  చెప్పినందుకు అవాస్తమైన ఆరోపణలు చేశారని ఆమె తెలిపారు.

## కారు ఆటో కు ఢీ

**టీ మీడియా ఫిబ్రవరి 06, భూర్గంపాడు :**బూర్గంపాడు మండలం మొరంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మర్రికుంట గ్రామంలో గురువారం అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అశోక్, సంధ్యలకు  స్వల్ప గాయాలతో తప్పించుకున్నారు. అశ్వాపురం నుంచి మొరంపల్లి బంజార్‌లో శుక్రవారం సంతకు కూరగాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగించే వీరు బంజార్ సంతకు కొస్తున్నారు.అయితే కారు  ఢీకొట్టడం వల్ల ఆటో మాత్రం నుజ్జునుజ్జు పోయింది.కారు డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంతో వచ్చి ప్రమాదానికి కారణమయ్యాడు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి చేర్చారు. అంతేకాకుండా 100 నంబర్‌కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. పరార్‌లో ఉన్న కారు డ్రైవర్‌ను వెంటాడి పట్టుకొని, పోలీసులకు అప్పగించారు. తమవంతు కారును స్వయంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు.



# లైఫ్ సర్టిఫికెట్ అప్‌డేట్ చేసుకోవాలి'

**-- ఏరియా జీఎం ఎం.శాలెం రాజు**

**టీ మీడియా,ఫిబ్రవరి 6, కొత్తగూడెం** :ఏరియాలో కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ (సిపిఆర్ఎంఎస్) ద్వారా వైద్య సేవలు పొందుతున్న మాజీ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో తమ లైఫ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా పునరుద్ధరణ (అప్‌డేట్) చేసుకోవాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం ఏరియాలో సుమారు 3 వేల మంది మాజీ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములు సిపిఆర్ఎంఎస్ స్కీం ద్వారా కంపెనీ అందిస్తున్న వైద్య సేవలను పొందుతున్నారన్నారు. ఈ స్కీం కింద మెడికల్ కార్డు కలిగిన లబ్ధిదారులు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.సిపిఆర్ఎంఎస్ పోర్టల్ డేటా ప్రకారం శుక్రవారం వరకు 389 మంది మాజీ ఉద్యోగులు, 513 మంది వారి జీవిత భాగస్వాములు ఇప్పటికీ లైఫ్ సర్టిఫికెట్లను అప్‌డేట్ చేయించుకోలేదని వెల్లడించారు. లైఫ్ సర్టిఫికెట్ పునరుద్ధరణ చేయని పక్షంలో అత్యవసర వైద్య పరిస్థితుల్లో మెడికల్ కార్డు ద్వారా చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని జీఎం హెచ్చరించారు. అలాంటి సమస్యలు తలెత్తకుండా సిపిఆర్ఎంఎస్ స్కీం కింద మెడికల్ కార్డు కలిగిన మాజీ ఉద్యోగులు, వారి డిపెండెంట్ అయిన భార్యలు వెంటనే జీవన్ ప్రమాణ్ పోర్టల్‌లో తమ లైఫ్ సర్టిఫికెట్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్ అప్‌డేషన్ పూర్తయితే మెడికల్ కార్డు ద్వారా వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పొందవచ్చని తెలిపారు.





## బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**టీ మీడియా,ఫిబ్రవరి 6,చర్ల:** చర్ల మండలంలోని ఏజెన్సీ ప్రాంత వాసులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించేందుకు వద్దిపేట,పూసుగుప్ప గ్రామాల మధ్యలో నాలుగు కోట్ల యాభై లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మితమవుతున్న బ్రిడ్జి పనులను శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అక్కడ ఉన్న అధికారులకు సూచించారు.

**దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ను**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం  దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ ను సందర్శించి అక్కడ విధులలో ఉన్న పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా,సైబర్ నేరాల పట్ల ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్సై గణేష్,సిబ్బంది పాల్గొన్నారు.

## వరి వెదజల్లే పద్ధతులపై రైతులకు శిక్షణ

**టీ మీడియా,ఫిబ్రవరి 6, రుద్రంపూర్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నేరుగా వరి విత్తనాలు వెదజల్లే పద్ధతి, యజమాన్య పద్ధతులపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ వరి పరిశోధన కేంద్రం,



హైదరాబాద్‌కు చెందిన డా.మహేంద్ర కుమార్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. పద్మావతి హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.టి.భరత్ అధ్యక్షత వహించారు. రైతులను ఉద్దేశించి డా.పద్మావతి మాట్లాడుతూ.. వరి పంటలో చీడపీడల నివారణకు వారు అభివృద్ధి చేసిన లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టల వినియోగంపై రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు. అనంతరం డా.మహేంద్ర కుమార్ మాట్లాడుతూ.. నేరుగా వరి విత్తనాలు వెదజల్లే పద్ధతి గురించి రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈ సాగు విధానంలో కలిగే లాభాలు, ఖర్చు తగ్గింపు, పంట దిగుబడి పెరుగుదలతో పాటు ఈ పద్ధతిలో గడ్డిని ఎలా నియంత్రించాలో కూలంకషంగా వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ రైతుల అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకుని ఇతర రైతులకు తెలియజేశారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ఫామ్‌లో డ్రోన్ పద్ధతిలో వరి సాగు విధానాలను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. అలాగే గిరిజన రైతులకు డ్రమ్ సీడర్ పరికరాన్ని అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాయపాడు గ్రామం (అల్లపల్లి మండలం), పెనగడప గ్రామం (చండుగొండ మండలం), నిమ్మలగూడెం గ్రామం, సుజాతనగర్ మండలం నుండి సుమారు 80 మంది రైతులు పాల్గొన్నారు.



## నాసిరకంగా అలుగు నిర్మాణ పనులు

**టీ మీడియా,ఫిబ్రవరి 6, చంద్రుగొండ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ మండలం సీతాయిగూడెం వెంగలరాయ సాగర్ ప్రాజెక్టు అలుగు నిర్మాణాన్ని బీఆర్ఎస్ మండల కమిటీ శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా అలుగు నిర్మాణ లోపాలను నాయకులు ఎత్తి చూపారు. నాసిరకం ఇసుక, యాష్ పౌడర్‌ని కలిపి నిర్మాణం కొనసాగించడం వల్ల నిర్మాణం త్వరగా దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావునా ఈ నిర్మాణాన్ని ఆపి గోదావరి ఇసుకతొ మాత్రమే నిర్మాణం చేపట్టాలన్నారు. లేకపోతే ఆయకట్టు రైతులందరితో కలిసి ఆందోళన చేయనున్నట్లు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారా వెంకటేశ్వరావు (బాబు), ప్రధాన కార్యదర్శి, దామరచర్ల వైస్ సర్పంచ్ సంగొండి రాఘవులు, పార్టీ పట్టణాధ్యక్షుడు, 2వ వార్డు సభ్యుడు సూరా వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మేడ మోహనరావు, నరుకుల్ల అప్పాజి, సత్తి నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ పాండ్ల అంజనరావు, కేలోత్ శ్రీనివాస్, ఆయకట్టు రైతులు అచ్చన రాము, సానిక మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి

తమ వివరాలను టీఎంఆర్ఈఐఎస్. తెలంగాణ. జిఓవి. ఐఎన్ వెబ్సైట్ లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, అదే విధంగా ఈ నెల 14 తేదీన ఉమ్మడి జిల్లాలలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. ఇతర సమాచారం కొరకు 9000255330 నంబరు కు సంప్రదించాలి అని కోరారు.

## సమ్మక్క సారక్క మీరే దిక్కు.

ఎప్పటికప్పుడు బ్యాంక్ లో జమ చేస్తున్నట్లు తెలిపారు దేవాదాయశాఖ అధికారులు. గురువారం ( ఫిబ్రవరి 5 ) దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన హుండీల కౌంటింగ్ భారీ భద్రత మధ్య కొనసాగుతోంది. 200 మంది అధికారులు, 300 మంది వాలంటీర్లతో భారీ భద్రత మధ్య కౌంటింగ్ ప్రక్రియ సాగుతోంది. ఈ కార్యక్రమంలో మొదటి రోజు మంత్రి కొండా సురేఖ సహా ఆదివాసి పూజారులు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.గత ఏడాది జాతర కంటే ఈ ఏడాది 288 అదనపు హుండీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు అధికారులు. మేడారం జాతరలో 828 హుండీలలో భక్తులు వేసిన కానుకలను లెక్కిస్తున్నారు అధికారులు. బెల్లం..కొబ్బరి నీళ్లతో కరెన్సీ తడిచిపోయిన క్రమంలో వాటిని లెక్కించడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అధికారులు.కౌంటింగ్ ఏరియాలో 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌంటింగ్ జరుగుతోంది.

# వార్డు సభ్యుడిపై బ్లాక్‌మెయిల్

-ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు

టీ మీడియా ఫిబ్రవరి 6,తిరుమలాయపాలెం:తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ 11వ వార్డు సభ్యుడు కొండ ఉపేందర్‌పై పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గంట రాజుకుమార్ అసత్య ఆరోపణలు చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నాడని ఎం డి ఓ కు ఫిర్యాదు చేశారు. గ్రామ అభివృద్ధి అంశాలపై నిర్వహించిన గ్రామ పాలకవర్గ సమావేశంలో పంచాయతీ వర్కర్లు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని, అందరూ సమానంగా పనిచేయాలని గ్రామ సెక్రటరీ, సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో ఈ వివాదం ప్రారంభమైనట్టు తెలిపారు. ఈ నిర్ణయాలు నచ్చకపోవడంతో గంట రాజుకుమార్ తండ్రి ఈదయ్య అనే వ్యక్తి కొండ ఉపేందర్‌పై తన భార్యతో అక్రమ సంబంధం ఉందంటూ అసత్య ఆరోపణలు చేస్తూ గ్రామంలో ప్రచారం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమావేశం ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో బండికి అడ్డుగా నిలబడి దుర్భాషలతో దూషిస్తూ ప్రజలముందు తన పరువు తీసే ప్రయత్నం చేశాడని తెలిపారు. ఇతర పంచాయతీ వర్కర్లు డ్యూటీ డ్రెస్‌తో విధులు నిర్వహిస్తుంటే గంట రాజుకుమార్ మాత్రం నేను గ్రామ కరోబరిని అంటూ వర్కర్లపై పెత్తనం చెలాయిస్తూ అధికారిలా వ్యవహరిస్తున్నాడని, దీనిని ప్రశ్నించినందుకే తనను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. రాజ్ కుమార్ అనే వ్యక్తి తన భార్యతో అక్రమ సంబంధం అని అసత్య ఆరోపణలు చేస్తుండటంతో కుల పెద్దల దృష్టికి తీసుకెళ్లినా పెద్దమనుషుల సమక్షంలో చర్చకు రావడానికి కోరగా గంట రాజుకుమార్ నిరాకరించాడని, అంతేకాక కొండ ఉపేందర్‌ను



ఎలాగైనా హత్య చేయుటకు కార్యచరణ చేపడుతున్నానని అతనిని ఎలాగైనా చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు. గంట రాజుకుమార్ వల్ల నాకు ప్రాణహాని ఉందని, ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని కొండ ఉపేందర్ కోరారు.

# బేస్ మెంట్ నిర్మించి వదిలేశారు.

-4 సంవత్సరాల నుండి నిలిచిన గ్రామపంచాయతీ

టీ మీడియా, ఫిబ్రవరి 6 కామేపల్లి :నిధులు మంజూరై నాలుగేళ్ల అవుతున్న అప్పటి అధికారులు కొందరు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల గ్రామపంచాయతీ భవన నిర్మాణం బేస్మెంట్ స్థాయిలోనే దర్శనమిస్తుంది. మండలంలోని కొమ్మినేపల్లి గ్రామపంచాయతీ నుండి మూడు గ్రామాలను వేరు చేసి రుక్కి తండ గ్రామపంచాయతీ గత ఆరు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేశారు. ఈ గ్రామ పంచాయతీకి భవనం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇది గమనించిన అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ ఈజీఎస్ నిధులు 2023 సంవత్సరంలో 20 లక్షలు కేటాయించి శంకుస్థాపన సైతం చేశారు. కానీ ఈ గ్రామపంచాయతీ నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టర్ పునాదులు తీసి బేస్మెంట్ లెవల్ వరకు నిర్మాణం చేసి వదిలేసారు. దీంతో దీంతో దీంతో ఈ గ్రామ పంచాయతీ నిర్మాణానికి కేటాయించిన నిధులు నేలపాలు అయినట్లు అయింది.ఈ మూడు గ్రామాల ప్రజలకు గ్రామపంచాయతీ భవనం లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఈ గ్రామానికి చెందిన ప్రజలు ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినా ఈ నిర్మాణం పూర్తి కాలేదు. రుక్కి తండా పాఠశాలలో చిన్న ఇరుకు గదిలో పంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేయడంతో ఈ గ్రామాల ప్రజలు ఆ కార్యాలయానికి వందలాదిగా రాకపోకలు సాగిస్తూ ఉండడంతో ఈ పంచాయతీ చెందిన గ్రామసభ లు అక్కడే నిర్వహించడంతో స్కూల్లో ఉన్న విద్యార్థులకు టీచర్లు చెప్పే పాఠాలు అర్థం తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్, గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బంది ఎక్కడనుండి విధులు నిర్వహించాలో అర్థం కాని అయోమయ పరిస్థితి దాపురించింది. తమకు తక్షణమే గ్రామపంచాయతీ నిర్మాణం పూర్తి చేయాలని లేకుంటే అధికారుల కార్యాలయాల ముందు నిరసనలకు దిగాల్సి వస్తుందని ఈ మూడు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆరు గ్యారంటీల అమలు ఇంకెప్పుడు...

### కూటమి అభ్యర్థులను గెలిపించండి...

టీ మీడియా, ఫిబ్రవరి 6 ఖమ్మం రూరల్

బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకులు కోతలు, ఉత్తుత్తి మాటలకే పరిమితం అవుతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ లతో కలిసి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని పల్లెగూడెం, కొత్త కాలనీ, రెడ్డిపల్లి, రాజీవ్ నగర్, రాజీవ్ గృహ కల్ప, గుదిమళ్ళ, వెంకటగిరి తదితర గ్రామాలు, కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతా మధు, కందళా మాట్లాడుతూ...మున్సిపల్ ఎన్నికల్లో కారు, సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి ఏదులాపురం మున్సిపాలిటీని కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామన్నారు. ఓటమి భయంతో అర్ధరాత్రి ఫోన్ చేసి ప్రలోభాలకు గురి చేసే పరిస్థితికి దిగజారారని కాంగ్రెస్ నాయకులను విమర్శించారు. కూటమి అభ్యర్థులు కార్యకర్తలు,శ్రేణులు నాలుగు రోజులు అప్రమత్తంగా ఉండి కూటమి అభ్యర్థులను ఘన విజయంతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు వచ్చేసరికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం గుర్తుకొస్తుందని విమర్శించారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు కానీ హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక రెండేళ్లలో ప్రజలకు తీవ్ర నరకం చూపెడుతుందని విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు హామీ తప్ప మిగతా గ్యారంటీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్, సీపీఎం కూటమి పంచాయతీ ఎన్నికల్లో అద్భుతమైన విజయాలు సాధించిందని వాటికంటే మెరుగైన ఫలితాలు మున్సిపాలిటీలో సాధించాలని ప్రజలకు సూచించారు.

నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే సీపీఎం, బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, మేకల ఉదయ్ కుమార్, సీపీఎం నాయకులు నందిగామ కృష్ణ, వై.ప్రసాద్ రావు, బండారు రమేష్, సునీల్, ఆంటోనీ, శానం వీరబాబు, బాలరాజు, సాల్వే ముత్తయ్య, నంబూరి నారాయణ రావు, దగ్గుపాటి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల జారీకి ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి • 9 నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి

టీ మీడియా, ఫిబ్రవరి 6 ఖమ్మం కలెక్టరేట్

సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో 2026-28 సంవత్సరానికి జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితి గడువు ఫిబ్రవరి 28తో ముగియనున్నందున అర్హత కలిగిన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం మీడియా యాజమాన్యాలు తమ జర్నలిస్టుల పేర్ల జాబితాను జిల్లా పౌరసంబంధాల అధికారి నకు సమర్పించాలన్నారు. యాజమాన్యాలు ద్వారా పంపిన పేర్లలో ఉన్న జర్నలిస్టులు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారిక వెబ్ సైట్ http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఆన్ లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 9 నుండి సమర్పించాలని, అర్హులైన జర్నలిస్టులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తనిఖీలు

టీ మీడియా,ఫిబ్రవరి 6, చర్ల : చర్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆసుపత్రి సేవలు ఎలా ఉన్నాయో క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టుకుని, ప్రతి విభాగాన్ని శాస్త్రీయంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల కేసుల సంఖ్య, చికిత్సా పరిస్థితులు, ముందస్తు చర్యలపై అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఈ తనిఖీ జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల సేవల సమగ్రతను మెరుగుపరచడానికి భాగంగా జరిగింది.ఆసుపత్రిలోని ఓపీ విభాగం, రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబొరేటరీ, ఇన్‌పేషెంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్, మందుల గది, డయాలసిస్ కేంద్రం అన్ని ప్రధాన విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. డయాలసిస్ కేంద్రంలో ప్రస్తుతం 23 మంది రోగులు రోజువారీ చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రం జిల్లాలోని డయాబెటిస్, కిడ్నీ సంబంధిత రోగులకు ప్రధాన మద్దతుగా నిలుస్తోందని వివరించారు. అటెండెన్స్ రిజిస్టర్లు, ఓపీ రికార్డులు, మందుల స్టాక్ రిజిస్టర్లను ముస్తీకరించి, సిబ్బంది హాజరు, పని ప్రదర్శనపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, మందులు సక్రమంగా, సమయానికి అందుతున్నాయా, చికిత్సలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని విచారించారు. చాలా మంది రోగులు సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ శుభ్రత, వంటి చర్యలు చేపట్టాలని రోగులకు, సిబ్బందికి సూచించారు. మందుల సరఫరాలో ఎలాంటి అంతరాయం రాకుండా చూడాలని, నెల ముందుగానే మెడిసిన్ ఇండెంట్ సమర్పించి స్టాక్‌ను నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆసుపత్రి పరిశుభ్రత, వ్యవస్థీకృత సేవలు, నాణ్యమైన వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సిబ్బంది శిక్షణ, పరిపాలనా సమస్యలపై కూడా చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవలపై నిరంతర పర్యవేక్షణ, మెరుగుదలలు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హైలైట్ చేశారు. ఈ తనిఖీ జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సందర్శనలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

### భద్రాచలంలో

ప్రతిరోజు అంగనవాడి సెంటర్లలో పనిచేసే ఆయలు, పిల్లల శుభ్రత గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని, పిల్లలు సెంటర్‌కు వచ్చినప్పుడు వారి మానసిక స్థితిని గమనించి ఆటల ద్వారా పాఠశాల వైపు ఆకర్షించాలని సూచించారు. అంగనవాడి టీచర్లు ఇంటింటి తిరగి గర్భిణీలకు బాలామృతం, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా అవగాహన కల్పించాలని చెప్పారు. చివరిగా గర్భిణీలకు బాలామృతం సంబంధిత ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, సిడిపిఓ రేవతి, సూపర్వైజర్లు సక్కుబాయి, శ్రీదేవి తదితర మహిళలు పాల్గొన్నారు.

### విధులను పకడ్బందీగా నిర్వహించాలి..

కాలుష్యానికి ముఖ్య కారణం రోడ్డు మీద ఉండే డస్ట్ కారణంగా ఉంటుందని, దీని నివారణకు మనవంతు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అన్నారు. నగరానికి త్రాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన త్రాగునీటి సరఫరా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న మోటార్ లలో అవసరమైన మరమ్మత్తులు చేస్తే విద్యుత్ బిల్లులు తగ్గుతాయని, ఈ పనులను 3 వారాల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.నగరంలో ఎస్.టి.పి. ల నిర్మాణానికి అవసరమైన భూములు ఫిబ్రవరి 15 నాటికి అప్పగిస్తామన్నారు. నగరంలో పెండింగ్ ఉన్న 1.6 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను అదనపు లేబర్ పెట్టి 4 వారాల్లో పూర్తి చేయాలన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ క్రింద నగరంలో ఉన్న కుక్కలను నగరానికి దూరంగా షెల్టర్ ఏర్పాటు చేసి తరలించాలని అన్నారు. నగరంలో వీధి కుక్కలకు ఎవరు ఫీడ్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. కుక్కలకు అన్నం పెట్టడం వలన అలవాటుగా మారి, అన్నం దొరకని రోజు అవి దాడులకు పాల్పడుతున్నాయని, ఈ అంశం ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. నగరంలో ఎక్కడా డార్క్ ఏరియా ఉండకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, సహాయ మునిసిపల్ కమీషనర్ అనిల్ కుమార్, మునిసిపల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.